క్లుప్తంగా

షూటింగ్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కుమార్



స్టేషన్‌ఘన్‌పూర్: షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లుకు చెందిన అన్నెపు కుమార్ ఎన్నిక య్యాడు. ఈనెల 3న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ఐలయ్య ఆధ్వర్యంలో అసోసియేషన్ స్టేట్ జనరల్ బాడీ మీటింగ్, కమిటీ ఎన్నిక నిర్వహించారు.

విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం



పాలకుర్తి : మండలంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థిని మాచర్ల శ్రీజకు గూడూరు జెడ్పీ పాఠశాలలో చుక్కా రామయ్య చారిటబుల్ ట్రస్టు తరఫున నగదు బహుమతిని ప్రదానం చేశారు. శనివారం జెడ్పీ పాఠశాలలో మండల స్థాయిలో మండలంలో ప్రథమ స్థాయిలో మార్కులు పొందిన మాచర్ల శ్రీజకు రూ.50 వేల నగదును చుక్కా రామయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మాచర్ల పుల్లయ్య ఉపాధ్యాయులతో కలిసి బహుమతిని అందజేశారు. పాఠశాలలో ద్వితీయ స్థానంలో మార్కులు పొందిన సింగిరెడ్డి మధుకర్‌కు రూ. 3 వేల నగదును బహూకరించారు. హెచ్‌ఎం శైలజ, యాకలక్ష్మి, ఉపాధ్యాయ బృందం సభ్యులు నగదును వారికి అందజేశారు.

పాఠశాలకు చెక్కు అందజేత



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాలకు శనివారం నెల్లుట్ల కేశవరావు–కమలమ్మ ట్రస్టు పక్షాన పదో తరగతి మెరిట్ విద్యార్థులకు కోసం రూ.20వేల చెక్కు నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు అందజేశారు. గతంలో పాఠశాల పేరుతో రూ.లక్ష బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా దాని నుంచి వచ్చిన వడ్డీ మొత్తాన్ని పదిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు కోసం అందజేస్తున్నామని రవీందర్‌రావు తెలిపారు. పెండ్యాల ఉపేందర్‌రావు సమన్వయంతో ట్రస్టు పేరుతో డిపాజిట్ చేసి ప్రతీ ఏడాది విద్యార్థులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రవీందర్, కొండా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పరికరాల అందజేత



రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థుల మేథస్సు కోసం రూ.65 వేల విలువైన సైన్స్ పరికరాలు అందించారు. 1982–83 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం హెచ్‌ఎం ఆనంద్‌కుమార్‌కు పరికరాలు అందజేసి ఔదార్యం చాటారు. చంద్రశేఖర్‌రెడ్డిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ అబ్బాస్‌మియా, ఎంఎంసీ చైర్మన్ మేడ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వార కల్యాణం



ప్రత్యేక పూజలు చేస్తున్న చంద్రమోహన్

చిల్పూరు : స్థానిక చిల్పూరు గుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు వేద మంత్రాల మధ్య వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ధ్వజస్తంభం అందజేసిన దాత విజయగిరి చంద్రమోహన్–సమత దంపతులతో పాటు శ్రీకాంత్ పాల్గొనగా ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి పట్టు వస్త్రాలతో సన్మానించారు. కల్యానానికి వచ్చిన భక్తులకు గూడూరు రమేష్–శారద, తిరునగరి శ్రీధర్–పద్మావతి, రంగారెడ్డి–ప్రమీల దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఇరుకుగా తహసీల్దార్ కార్యాలయం

- 23 మంది సిబ్బందికి ఒకే హాల్, మూడు చిన్నగదులు
- కొత్తగా వచ్చిన జీపీఓలకు సీట్లు కరువు



తహసీల్దార్ కార్యాలయం

లింగాలఘణపురం: తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా ఉంది. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 1998లో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఒక హాల్, మూడు చిన్న గదులు మాత్రమే ఉన్న కార్యాలయంలో ఇటీవల వచ్చిన జీపీఓలతో కలిసి 23 మంది సిబ్బంది ఉన్నారు. అంతేకాకుండా నాలుగేళ్ల క్రితం నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయడంతో హాల్‌లోనే పార్టీషన్ చేసి రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేశారు.ఉన్న మూడు గదుల్లో ఒకటి తహసీల్దార్, మరొకటి డిప్యూటీ తహసీల్దార్, ఇంకోటి రికార్డు గదిగా వినియోగించుకుంటున్నారు. దీంతో ఇటీవల వచ్చిన జీపీఓలకు కుర్చీలు వేసేందుకు స్థలం కరువైంది. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గతంలో నిర్మించిన కంప్యూటర్ గదిని కూడ వినియోగించుకున్నా ఇరుకుగానే ఉంది. సుమారు 27 ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం భారీ వర్షాలకు కురవడంతో ఏడాది క్రితం మరమ్మతులు చేశారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్లు లేవు. గతంలో అసంపూర్తిగా ఉన్న గోడలు మాత్రమే ఉన్నాయి. కాగా కార్యాలయ సమీపంలో ఖాళీ స్థలం బాగానే ఉన్న నూతన భవనానికి మాత్రం నోచుకోవడం లేదు.

సిబ్బందికి ఇబ్బందిగా ఉంది

ఇటీవల వచ్చిన 9 మంది జీపీఓలతో మొత్తం 23 మంది సిబ్బందికి ఇరుకుగా ఉంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కావడంతో ప్రజలు ఎక్కువగా వస్తున్నారు. వారికి కూడా ఇబ్బందిగానే ఉంది. కొత్త భవనం కోసం అధికారులను కోరుతున్నాం.

– రవీందర్, తహసీల్దార్

వెలవెలబోయిన సర్కారు బడులు

- 20 శాతం విద్యార్థులు, 95 శాతం టీచర్ల హాజరు

దసరా ఎఫెక్టు



జిల్లాలోని ఓ పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు

జనగామ : దసరా పండుగ సెలవు మూడ్ నుంచి విద్యార్థులు బయటకు రాలేకపోయారు. 13 రోజుల పాటు వరుస సెలవులు ముగించుకుని పాఠశాల పునఃప్రారంభం రోజు పిల్లల హాజరు 20 శాతం దాటలేదు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు ప్రకటించింది. నాలుగో తేదీ శనివారం పాఠశాలలు తిరిగి తెరుచుకున్నప్పటికీ, మరుసటి రోజు ఆదివారం కావడంతో విద్యార్థులు 80 శాతం మేర బడికి గైర్హాజరయ్యారు. జిల్లాలోని కేజీబీవీ, మోడల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పరిధిలో 29వేల మంది పిల్లలు ఉంటారు. విద్యార్థుల హాజరు 20 శాతం మేర నమోదు కాగా, టీచర్లు మాత్రం 95 శాతం హాజరయ్యారు.

ఒక్కో పాఠశాలలో..

జిల్లాలోని చాలా చోట్ల ఒక్కో పాఠశాలలో ఐదుగురు విద్యార్థుల కంటే ఎక్కువగా రాలేదు. దీంతో ఉపాధ్యాయులు సాయంత్రం నాలుగు గంటల వరకు ఉన్న పిల్లలకే బోధించారు. విద్యార్థులు లేని తరగతి గదులు బోసిపోయి కనిపించాయి. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులను 4వ తేదీ వరకు పొడిగించడంతో ఆదివారం కలుపుకుని 15 రోజుల పాటు వరుస సెలవులు వచ్చాయి. దీంతో వందశాతం విద్యాసంస్థలు అక్టోబర్ 6 (సోమవారం) నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఇంట్లో పండగ వాతావరణం నుంచి బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లను స్కూల్‌కి పంపించడంలో ఆసక్తి చూపలేదు. పాఠశాలల పునఃప్రారంభ సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులు, టీచర్ల హాజరు వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యార్థుల తక్కువ హాజరుపై మానిటరింగ్ చేస్తూ, 6న వంద శాతం పిల్లలు బడికి వచ్చేలా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. దసరా ఉత్సాహం తగ్గి, తరగతి గదులు మళ్లీ నిండుగా కనిపించే సమయం అక్టోబర్ 6 తర్వాతే అనిపిస్తోంది.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల : ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

దేవరుప్పుల : రెండేళ్లుగా స్థానిక పరిపాలనకు తీవ్ర విఘాతం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలచే గుణపాఠం తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో సీర్మాలకు చెందిన పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ తార, ప్రశాంత్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతల రవీందర్‌రెడ్డి, ఓయూ జేఏసీ నేత ఇప్ప పృథ్వీరెడ్డి, తీరుపెల్లి కొండల్ రెడ్డి, ఎడ్ల శ్రీను, మెట్టు వింసెట్ రెడ్డి,బత్తిని మల్లేష్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో అసలైన కాంగ్రెస్ శ్రేణులు ఆత్మగౌరవ కోసం బీఆర్ఎస్‌లో చేరడాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్, చింత రవి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్,మాజీ జీసీసీ చైర్మన్ ధరావత్ గాంధీ నాయక్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్ నాయక్ పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు దక్కవు : రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి రానున్న ఏ ఎన్నికల్లోనూ డిపాజిట్లు సైతం దక్కవని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య జోస్యం చెప్పారు. 'ఊరూరికి బీఆర్ఎస్ అభివృద్ధి–ఇంటింటికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు' కార్యక్రమంలో భాగంగా రాజయ్య మండలంలోని పాంనూర్, నమిలిగొండ, చంద్రుతండా, విశ్వనాథపురం, తానేదార్‌పల్లి, జిట్టిగూడెం, తాటికొండ, కొత్తపల్లి, రాఘవాపూర్ గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా తానేదార్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వ్యక్తిగత స్వార్థం కోసం, బిడ్డ రాజకీయ భవిష్యత్ కోసం కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను మోసం చేసి కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాడని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వర్గాలను మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, నాయకులు మారపాక రవి, అక్కినపెల్లి బాలరాజు, చల్లా చందర్‌రెడ్డి, ఆకుల కుమార్, తాటికొండ సురేష్, కనకం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి మృతి తీరని లోటు : ఎమ్మెల్యే



దామోదర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల : కరుడు కట్టిన కాంగ్రెస్ వాదిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకొని నిరుపేద ప్రజల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆయన మృతి తీరని లోటని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగిన దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు ఆమె హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దామోదర్‌రెడ్డి నిరంతర ప్రజాసేవ తపన, పట్టుదల మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు.

ఐకేపీ బుక్ కీపర్‌ను మార్చాలి

చిల్పూరు: నాలుగేళ్లుగా స్థానిక ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బుక్ కీపర్ పనిచేస్తున్న గాదె శ్రీలత అవకతవకలకు పాల్పడుతున్నందున వెంటనే మార్చాలని పలువురు ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం సంగీత, ఉష, కళ, కవిత, నాగమ్మ, నలిమెల కుమారస్వామి, గాదె రాజు, రేణుక మాట్లాడుతూ ఐకేపీలో శ్రీలత అవకతవకలకు పాల్పడుతున్నందున పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆమెను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు. నెల రోజుల క్రితం కమిటీ వేసి ఎస్సీ వారికి అవకాశం కల్పించాలంటూ సీసీ కవిత, సీఏ తిరుమల, సరిత, నీరజలకు విన్న వించినా పట్టించుకోకుండా తిరిగి అదనంగా మధ్యాహ్న భోజనం వంటకి కూడా ఆమెనే నియమించారని ఆరోపించారు. శ్రీలతను తొలిగించకుంటే ఆందోళన చేస్తామన్నారు.

సీపీఎం సత్తా చాటాలి

జఫర్‌గఢ్ : సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ.షబానా, పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రామారావును పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

రిజర్వేషన్లలో దళితులకు అన్యాయం

- ఎంపీడీఓకు కోడూరు గ్రామస్తుల వినతి



ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపల్లి: జనాభా లెక్కల సమయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరితో మండలంలోని కోడూర్ గ్రామ దళితులకు శాపంగా మారిందని ఆరోపణలు వస్తున్నాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం గ్రామంలో 480 మంది దళితుల జనాభా ఉండేది. పదేళ్ల తర్వాత జరిగిన 2011 జనాభా లెక్కలలో అధికారుల నిర్లక్ష్యంతో కేవలం 48 మంది దళితులు మాత్రమే గ్రామంలో ఉన్నారని తప్పుడు లెక్కల జాబితాను సమర్పించారు. 480 మందిలో 0 తొలగించి 48 మందిని మాత్రమే దళితులుగా అధికారికంగా తయారు చేసిన నివేదికలో చూపిస్తున్నారని, మిగతా 432 మందిని బీసీలుగా చూపిస్తూ తప్పుడు నివేదికలను అధికారులు సమర్పించడం ఎంతవరకు సమంజసమని దళితులు ప్రశ్నిస్తున్నారు. దళితులను బీసీలుగా రికార్డుల్లో చూపించడంతో ఇటీవల ఎంపీడీఓలు తయారుచేసిన వార్డు సభ్యుల రిజర్వేషన్లలో ఎస్సీలకు చోటులేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీలకు కేటాయించాల్సిన వార్డు సభ్యుల రిజర్వేషన్లను వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈవిషయమై ఎంపీడీఓ శ్రీనివాసులును వివరణ కోరగా గతంలో జరిగిన జనాభా లెక్కలలో ఎస్సీ జనాభా తప్పుడుగా చూపినట్లు తెలుస్తుంది. సమస్య ఉన్నతాధికారులదృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొయ్యడ మల్లేష్, మాజీ సర్పంచ్ జోగు గట్టయ్య, భాస్కర్, మదన్‌మోహన్, రామాంజనేయులు, యాకయ్య, పరుశరాములు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ

పాలకుర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని కొండాపురం, వావిలాల ఎంపీటీసీ ఏరియా పరిధిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కోల వేణు ప్రభాకర్, మంగ అంజయ్య బాలాజీ వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, చిట్యాల అయిలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావుడ్య మంజుల భాస్కర్, కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ మార్కెట్ చైర్మన్ గంగు కృష్ణమూర్తి, మాజి ఎంపీపీలు యాకసోమయ్య, శ్రీనివాస్, మండల సమన్వయకర్త శ్యామ్ సందర్ రెడ్డి, గణేష్, ఏకాంతరావు, ఎం.డి మదార్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడిపై దృష్టి సారించాలి

- కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ సునీత



రైతులకు అవగాహన కల్పిస్తున్న సునీత

పాలకుర్తి టౌన్: వ్యవసాయంలో పంట మార్పిడిపై రైతులు దృష్టి సారించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ రౌతు సునీత రైతులకు సూచించారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ సహకారంతో శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంటల సస్యరక్షణ, పురుగుల నివారణ అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమగ్ర సస్యరక్షణ చర్యలతో పంటల అధిక దిగుబడి పొందవచ్చని అన్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులకు ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, డివిజన్ వ్యవసాయ శాఖ ఉపసంచాలకుడు పరుశరాంనాయక్, ఏటరేపాల శరత్‌చంద్ర, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి ఉదయ్ శంకర్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

బచ్చన్నపేట : స్థానిక ఎన్నికల కోడ్ వచ్చినందున మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎన్నికల అధికారి సూచనల మేరకు శనివారం తొలగించారు. జీపీ సిబ్బంది పార్టీ బ్యానర్లతో పాటు గోడలపై రాసిన రాతలను చెరిపివేశారు. అలాగే పార్టీ గద్దెలకు తెల్లరంగు వేశారు. ఇక ముందు అనుమతులు లేకుండా ఎలాంటి రాతలు రాయరాదని, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని ఎన్నికల అధికారి, ఎంపీడీఓ మమతాబాయ్ హెచ్చరించారు.

శిథిలావస్థలో ఆర్టీసీ పాత బస్టాండ్



శిథిలావస్థకు చేరిన బస్టాండ్ భవనం

బచ్చన్నపేట : మండల కేంద్రంలో చేర్యాల రోడ్డులో ఉన్న ఆర్టీసీ పాత బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలు పడితే ఆ స్లాబ్ ఉరుస్తున్నందున తొలగించాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రం నుంచి ఆలేరు, జనగామ, చేర్యాల పట్టణాలకు రోడ్ల సౌకర్యం ఉంది. దాదాపు 30 ఏళ్ల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌ను నిర్మించారు. ఇక్కడే ఆర్టీసీ అధికారులు ఉంటూ బస్సుల వేళలను నిర్దేశించేవారు. కొన్నేళ్ల తర్వాత నూతన బస్టాండ్‌ను నిర్మించడానికి కొందరు దాతలు జనగామ రోడ్డులో స్థలాన్ని ఇవ్వడంతో అక్కడే నూతన బస్టాండ్‌ను నిర్మించడంతో ఆర్టీసీ బస్సులు అన్ని అక్కడే నిలుస్తున్నాయి. ప్రయాణికులు కూడా అక్కడే ఉంటున్నారు. దీంతో ఈ పాత బస్టాండ్‌ను పట్టించుకునే వారు లేక దానిపై గడ్డి మొలిచి శిథిలావస్థకు చేరుకున్నది. అందులో కొందరు నూతన వ్యక్తులు రాత్రి వేళ నిద్రిస్తున్నారు. ఆ బస్టాండ్ భవనం ఎప్పుడు కూలిపోతుందో అని స్థానికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాత భవనాన్ని తీసివేయాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఫ్రెండ్లీకేర్ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కొడకండ్ల : మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన బ్రహ్మచారి విద్యుదాఘాతంతో గుర్రై మంచానికి పరిమితం కాగా కొడకండ్ల ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ తమవంతు చేయూతనిచ్చింది. బ్రహ్మచారి కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న ఫ్రెండ్లీకేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ స్పందించి వాట్సాప్ వేదిక కుటుంబ పరిస్థితిని వివరించగా దాతలు ముందుకొచ్చి రూ.51 వేల ఆర్థికసాయం, 75 కిలోల బియ్యం, నిత్యావసర వస్తు సామగ్రిని అందించారు. అదే గ్రామానికి చెందిన కిరణ్ ప్రతీ నెలా బ్రహ్మచారి మందుల ఖర్చును భరిస్తానని తెలుపగా అతని చిన్న కుమార్తె చర్మవ్యాధితో బాధపడుతున్నందున ఆసుపత్రి ఖర్చును భరిస్తానని జనగామ మైనార్టీ అధ్యక్షుడు షేక్ సద్దాం హామీ ఇచ్చారు. దాతలు అందించిన ఆర్థికసాయంలో రూ.40 వేలు బ్రహ్మచారి కుమార్తెల పేరిట పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి రూ.11వేల నగదును శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థికసాయం అందించిన దాతలకు ఫౌండేషన్ పక్షాన అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నవీన్, ప్రభాకర్, మహేందర్, సుధాకర్, నాగాలాండ్ సునేప్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కొమురయ్య

జనగామ రూరల్ : భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం పట్టణ ప్రచార కార్యదర్శి భైరపాక మహేందర్ మృతి చెందగా శనివారం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య మృతదేహానికి పూల మాలవేసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. చిన్న వయసులో అనారోగ్యంతో మృతి చెందాడని వారి కుటుంబానికి ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లందుల భిక్షపతి, ఉపాధ్యక్షుడు నాగిళ్ల రాజు, సత్యం, బాబు, సుధాకర్, నర్సయ్య, కార్మికులు ఆ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

మృతురాలికి బీఆర్ఎస్ నాయకుల నివాళి

దేవరుప్పుల : మండలంలోని కడవెండిలో బండారి నర్సమ్మ అకాల మరణం పొందగా బీఆర్ఎస్ మండల నాయకులకు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బండారి సత్తయ్య, ప్రభాకర్ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి హన్మంతు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మహేష్, అంజయ్య, ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఏటీఎల్ ల్యాబ్ సందర్శన



తరిగొప్పుల : అటల్ టింకరింగ్ ల్యాబ్ నేటి విద్యార్థుల్లో శాస్త్రీయ, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని మండల విద్యాశాఖ అధికారి నెల్లుట్ల జానకి అన్నారు. స్థానిక పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన భౌతికశాస్త్రం ప్రయోగశాలను శనివారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ప్రైవేట్కు దీటుగా శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఏటీఎల్ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయోగశాలను ఉపయోగించుకొని విద్యార్థులు వీలైనన్ని నూతన సాంకేతిక ప్రాజెక్టులను రూపొందించి వాటికి పేటెంట్ సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ఆమె వెంట హెచ్‌ఎం కారివేద మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీపీఎంను ఆదరించాలి

బచ్చన్నపేట : రాబోయే స్థానిక ఎన్నికల్లో సీపీఎం పార్టీ అభ్యర్థులను ఆదరించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మిన్నాలపురం ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి పాటుపడాలని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఐ బరిలో ఉంటుంది

చిల్పూరు : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు బరిలో ఉంటారని పార్టీ జిల్లా నాయకుడు పైస రాములు అన్నారు. మండలంలోని శ్రీపతిపల్లిలో శనివారం మండల కార్యదర్శి బోనగిరి కుమారస్వామి అధ్యక్షతన స్థానిక ఎన్నికలపై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

గెలుపునకు నాయకులు కృషి చేయాలి



మాట్లాడుతున్న నవీన్

పాలకుర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు పట్ల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. శనివారం మండలం మల్లంపల్లిలో ఎంపీటీసీ క్లస్టర్‌లోని క్లస్టర్ హట్యాతండాలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నవీన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిలో ప్రజలకు తప్పుడు అవగాహన వచ్చిందని అన్నారు.

తరిగొప్పుల : కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎంపీపీ ఆశావాహుల పేర్లను పరిశీలించారు.